రూ.కోటి కొల్లగొట్టిన కేటుగాళ్లు

ఇద్దరి నుంచి భారీ మొత్తంలో స్వాహా

హిమాయత్‌నగర్: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. ఇద్దరి నుంచి రూ.కోటికి పైగా కొట్టేసి మరిన్ని లక్షలు కావాలంటూ డిమాండ్ చేస్తుండటంతో బాధితులు శుక్రవారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నగరానికి చెందిన ఇద్దరు యువకులు వేర్వేరుగా గూగుల్‌లో పార్ట్‌టైం ఉద్యోగాల కోసం అన్వేషిస్తుండగా ఇద్దరు నేరగాళ్లు టెలిగ్రామ్ ద్వారా వారితో పరిచయం చేసుకున్నారు. ఇంటి వద్దనే ఉండి రూ. కోట్లు సంపాదించే ఐడియా ఇస్తామంటూ ఆశ చూపారు. తాము వర్క్ ఇచ్చేలోపు తాము చెప్పిన వెబ్‌సైట్‌లలో ఇన్వెస్ట్ చేయాలని కోరారు. పార్ట్‌టైం కంటే ఇన్వెస్ట్‌మెంట్‌లో ఎక్కువ లాభాలు ఉంటాయని, అత్యంత తక్కువ సమయంలో కోటీశ్వరులు కావొచ్చంటూ ఎర వేశారు. వారి మాటలు నమ్మిన వారిద్దరూ అందుకు అంగీకరించారు. తొలిరోజుల్లో రెండింతలు లాభాలు ఇచ్చి నమ్మకాన్ని రెట్టింపు చేసుకున్నారు. ఆ తర్వాత ఓ వ్యక్తి నుంచి రూ.94 లక్షలు, మరో వ్యక్తి నుంచి రూ.14లక్షలు పెట్టుబడి పెట్టించి టాస్క్‌లు అంటూ మాయ మాటలు చెప్పి కాలయాపన చేశారు. లాభాలు లేకపోయినా పర్వాలేదు తమ డబ్బు తమకివ్వాలని కోరినా స్పందించకుండా మరిన్ని రూ.లక్షలు డిమాండ్ చేస్తుండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ తెలిపారు.

సైబరాబాద్ పోలీసులకు ప్రతిభా పురస్కారాలు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ పోలీసు సిబ్బందికి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పతకాలను ప్రదానం చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశిష్ట సేవలందించిన పోలీసులకు ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. ఈ సందర్భంగా సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వారిని సేవా పతకాలతో సత్కరిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు సేవలు అందించాలన్నారు.



సైబరాబాద్ కమిషనరేట్‌లో పతకాలు అందజేస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

93 మంది పోలీసులకు పతకాలు, ప్రశంసాపత్రాలు

2022 సంవత్సరానికి గాను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 93 మంది పోలీసులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఇందులో 8 అతి ఉత్కృష్ట, 18 ఉత్కృష్ట, 10 సేవా పతకాలు కలిపి 36 మెడల్స్, 57 ప్రశంసాపత్రాలు అందజేస్తున్నామన్నారు. వీరిలో హోంగార్డు నుంచి ఏడీసీపీ ర్యాంక్ స్థాయి అధికారులు ఉన్నారన్నారు. డీజీపీ కమాండేషన్ తీసుకున్న వారిలో అదనపు డీసీపీ సీపీఎస్‌జీ నర్సింహారెడ్డి, సీపీఎస్ శశాంక్‌రెడ్డి, ఏసీపీ చంద్రశేఖర్, ఏసీపీ శ్యామ్‌బాబు, ఏసీపీ రఘునందన్‌రావు, బాలానగర్ సీపీఎస్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు, శంకర్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమార్, చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వాసు ఉన్నారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ నారాయణ్‌నాయక్, డీసీపీ యెగేష్ గౌతమ్, రితిరాజ్, నితికాపంత్, రష్మీపెరుమాల్, కవిత, శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సందీప్, పలువురు ఏడీసీపీలు, ఏసీపీలు, సీఏఓ అడ్మిన్ గీత, ఇన్‌స్పెక్టర్లు, మినిస్టీరియల్ స్టాఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మార్బుల్స్ లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ బోల్తా

ఒకరి దుర్మరణం, ముగ్గురికి గాయాలు

ఘట్‌కేసర్: మార్బుల్స్ లోడుతో వెళుతున్న వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన సంఘటన ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అశోక్ లేలాండ్ వ్యాన్‌లో డ్రైవర్ పవన్ కుమార్ బీబీనగర్ నుంచి మార్బుల్స్ లోడ్ తీసుకుని రాంపల్లికి వెళుతున్నాడు. అతి వేగం కారణంగా ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డు మైసమ్మగుట్ట హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద వ్యాన్ డివైడర్‌ను ఢీకొట్టి జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో మార్బుల్స్ మీద పడి సంజీవ (45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బీహార్‌కు చెందిన కూలీలు వికంద్‌రాయ్, సంతోశ్‌కుమార్, సురేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సంజీవ మృతదేహం



జాతీయ రహదారిపై బోల్తా పడిన వ్యాన్

ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ లోకేశ్‌కుమార్



హెచ్‌ఎండీఏ కార్యాలయంలో..

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కార్యాలయాల వద్ద తెలంగాణ అవతరణ వేడుకలు ఘనంగా జరిగాయి. అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయం ఆవరణలో సెక్రెటరీ పి.చంద్రయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, నానక్‌రామ్ గూడ లోని హెచ్‌జీసీఎల్ వద్ద మేనేజింగ్ డైరెక్టర్ (ఇన్ చార్జ్) బీఎల్ఎన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

- బేగంపేటలోని హైదరాబాద్ మెట్రో రైల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలోఎండీ ఎన్వీఎస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన వేడుకలలో హైదరాబాద్ జేటీసీ పాండురంగ్ నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రాంతీయ రవాణా అధికారి రాంచందర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐసీసీసీలో

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇండిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీఎస్ ఐసీసీసీ) ఘనంగా జరిగాయి. జాయింట్ సీపీ పరిమళ నూతన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.





మెట్రో రైల్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎన్వీఎస్ రెడ్డి



ఆర్టీఏ కార్యాలయంలో మాట్లాడుతున్న జేటీసీ పాండురంగ్ నాయక్

కోటలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కేంద్ర సాంస్కృతికశాఖ విభాగం వారు గోల్కొండ కోటలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కోటలోని రాణీ మహల్ ఎదురుగా ఉన్న ప్రాంగణం వీటికి వేదికైంది. డాక్టర్ ఆనంద్ శంకర్ అండ్ గ్రూప్, మంజుల రామస్వామి గ్రూప్ వారి నృత్య కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రముఖ గాయని మంగ్లీ గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొని వివిధ పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందించారు.

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

సుల్తాన్‌బజార్: తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అని నగర యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ యాదవ్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోషామహల్ నియోజకవర్గంలోని ఎంజే మార్కెట్ చౌరస్తా వద్ద సోనియాగాంధీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్ర సిద్ధించిందంటే కేవలం సోనియాగాంధీతోనే అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో పాటు తెలంగాణ ప్రజల ఆకాంక్షను తెలుసుకున్న సోనియా గాంధీ తెలంగాణను ఇచ్చి తెలంగాణ ప్రజల అభీష్టాన్ని నెరవేర్చాన్నారు. కాంగ్రెస్ నాయకులు సీకే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురా: తెలంగాణ ప్రజల రాష్ట్ర సాకారాన్ని నెరవేర్చిన సోనియాగాంధీకి తెలంగాణ ప్రజలు జీవితాంతం రుణపడి ఉంటారని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం లాల్‌దర్వాజా మోడ్ నెహ్రూ విగ్రహం వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



ఎంజేమార్కెట్ వద్ద సోనియాగాంధీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ముగిసిన సమ్మర్ కోచింగ్

చార్మినార్: జీహెచ్‌యంసీ చార్మినార్ జోన్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమాలు సిటీ కాలేజీ సమీపంలోని కులీకుతుబ్ షా నగరాభివృద్ధి సంస్థ (కుడా)స్టేడియంలో గురువారం సాయంత్రం జరిగాయి. పలువురు విద్యార్థినీవిద్యార్థుల ఆటలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ అమోఘమని కార్యక్రమానికి హాజరైన జీహెచ్‌యంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ నామా సామ్రాట్ అశోక్ ప్రసంశించారు. మొఘల్‌పురాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎన్నో ఏళ్లుగా యోగా శిక్షణలను అందజేస్తున్న సీనియర్ యోగా మాస్టర్ ఇబ్రాహీం జిలాని బృందానికి జోనల్ కమిషనర్ ట్రోఫీని అందజేసారు.

అభివృద్ధి వైపు పరుగులు

నాంపల్లి: తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ అస్తిత్వం కోసం దశాబ్దాల పాటు పోరాటం చేసి సాధించిన తెలంగాణ రాష్ట్రం పురోగమన దిశ వైపు పరుగులు పెడుతోందని తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకల సందర్భంగా పతాకావిష్కరణ చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా వర్సిటీ సంగీత శాఖ విద్యార్థులు తెలంగాణ ఉద్యమ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వర్శిటీ పీఠాధిపతులు, శాఖాధిపతులతో పాటుగా ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సౌకర్యం కోసమే పోలీస్ స్టేషన్ల ఏర్పాటు

అబిడ్స్: ప్రజల సౌకర్యార్థమే పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని సౌత్ వెస్ట్ డీసీపీ కిరణ్ కారే పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తామన్నారు. శుక్రవారం జోన్ పరిధిలో కొత్తగా ఏర్పాటైన మహిళా పోలీస్‌స్టేషన్‌ను, గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ..... ఎలాంటి సమస్యలున్నా 100కు డైల్ చేయాలన్నారు. స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఏసీపీ సతీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

75వ బోనాల వజ్రోత్సవాల సందర్భంగా చండీ హోమం



యాకుత్‌పురా: హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం 75వ బోనాల వజ్రోత్సవాల సందర్భంగా శుక్రవారం 38వ రోజు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, అర్చన నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్పీ క్రాంతి కుమార్ దంపతులు చండీహోమం నిర్వహించారు. మధ్యాహ్నం ప్రార్థన మందిరంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాందేవ్ అగర్వాల్, ప్రతినిధులు ఆవుల భరత్ ప్రకాశ్, ఎ.సతీష్ కుమార్ పర్యవేక్షించారు.

దివ్యాంగులకు ఉచిత విద్య

అబ్దుల్లాపూర్‌మెట్ : దివ్యాంగులైన చిన్నారులకు ఆంగ్ల మాధ్యమంలో ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామని వేగేశ్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీరామరాజు, చైర్‌పర్సన్ సుంకరపల్లి శైలజ తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకుని వారు మాట్లాడుతూ.. 35 ఏళ్లుగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్‌లో తమ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు ఎనలేని సేవలందిస్తున్నామన్నారు. వేగేశ్న ఫౌండేషన్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు వారు తెలిపారు. తమ ఫౌండేషన్‌ద్వారా ఉచిత సేవలను పొందాలకునే వారు కుంట్లూర్‌లోని వేగేశ్న ఫౌండేషన్‌లో ఈ నెల 13 నుంచి సంప్రదించాలని కోరారు.



వంశీరామరాజు

సెక్యూరిటీ కళ్లు కప్పి కేంద్ర మంత్రిని కలిసిన స్థానికుడు

గోల్కొండ : తెలంగాణ ఆవిర్భావ వేడుకలు గోల్కొండ కోటలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పతాకావిష్కరణ చేసి ప్రసంగించారు. అయితే మంత్రి ప్రసంగం అనంతరం గోల్కొండ నయాఖిల్లాకు చెందిన ఇలియాస్ అనే ఓ వ్యక్తి అక్కడున్న సెక్యూరిటీ కళ్లుకప్పి నేరుగా స్టేజ్ పైకి ఎక్కి కేంద్రం మంత్రిని కలిశారు. నయాఖిల్లాలో స్థానిక రైతుల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని మంత్రికి వినతిపత్రం ఇవ్వబోయాడు. అయితే అంతలోపే సెక్యూరిటీ సిబ్బంది, పలువురు బీజేపీ నాయకులు స్టేజ్ పైకి ఎక్కి అతనిని కిందకు తీసుకెళ్లారు. కాగా ఈసంఘటనతో స్టేజ్ పై ఉన్న కేంద్రమంత్రితో పాటు అధికారుల్లో కాసేపు ఆందోళన నెలకొంది.

'విలక్షణ నటుడు అక్కినేని'

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళావాహిణి ఆధ్వర్యంలో దేవదాసు చిత్ర సప్తతి వేడుకలను శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. తెలుగు చిత్రపరిశ్రమలో విభిన్న పాత్రలను పోషించి ప్రేక్షకులను మెప్పించిన నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని కొనియాడారు. అనంతరం దేవదాసు చిత్రం నటీమణి అనూరాధకు అక్కినేని అభినయ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

క్లుప్తంగా...

గుడిమల్కాపూర్ నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభం

అబిడ్స్: గుడిమల్కాపూర్ నూతన పోలీస్‌స్టేషన్‌ను ఇన్‌స్పెక్టర్ ఎం.రవి ప్రారంభించారు. టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్, కుల్సుంపురా, లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల నుంచి కొంత కొంత భాగాన్ని విడదీసి గుడిమల్కాపూర్ నూతన పోలీస్‌స్టేషన్‌గా రూపొందించారు. ఈ సందర్భంగా పలు బస్తీల వారు, అసోసియేషన్ల వారు ఇన్‌స్పెక్టర్ రవిని ఘనంగా సత్కరించారు.

శాంతి భద్రతల పరిరక్షణ కోసం రౌండ్ ది క్లాక్ సేవలు



చార్మినార్: పాతబస్తీలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు రౌండ్ ది క్లాక్ పని చేస్తున్నారని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పురానీ హవేలీలోని కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతి భద్రతల పరిరక్షణలో స్థానిక ప్రజల బాధ్యత ఎంతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ ఆనంద్,దక్షిణ మండలం పోలీసు కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ ముత్తు తదితరులతో పాటు ఏసీపీలు,ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పటేల్ చొరవతోనే తెలంగాణ ప్రాంతానికి విముక్తి



నాంపల్లి: నిజాం నిరంకుశ పాలన నుండి హైదరాబాదు సంస్థానానికి విముక్తిని కలిగించిన యోధుడు సర్దార్ వల్లభాయి పటేల్ అని, ఆయన కారణంగానే తెలంగాణ ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం ఆయన సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహానికి నివాళులర్పించి ప్రసంగించారు. కార్పొరేటర్లు మహలక్ష్మి, రామన్ గౌడ్, కొంతం దీపిక పాల్గొన్నారు.



దీఈఓ కార్యాలయంలో దీఈఓ రోహిణి



సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో....



ఆసిఫ్‌నగర్ శంకర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

ఉత్సాహం.. దశాబ్ది సంబరం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలు శుక్రవారం చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సందడిచేశారు. పలు చోట్ల జాతీయ జెండాను ఆవిష్కరించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది జెండా వందనం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.



జియాగూడలో మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ తదితరులు



సిటీ సివిల్ కోర్టులో జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారా



రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నిరంజన్ తదితరులు



మెడికల్ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో..



గాంధీభవన్ వద్ద సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం



రామ్‌కోఠి చౌరస్తాలో శీలం సరస్వతి ఆధ్వర్యంలో...



సిటీ సివిల్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు.



దారుషిఫా నాగదేవత దేవాలయం వద్ద బీజేపీ నేతలు..



గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో...



ఉస్మానియా ఆస్పత్రిలో..



బీజేపీ కార్యాలయంలో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్



కోఠి డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్‌లో..



సెట్విన్‌లో వేడుకల్లో ఎండీ కె.వేణుగోపాల్ రావు

రేపు లింగాయత్ మహాసభ

చార్మినార్: తెలంగాణలో లింగాయత్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4న చలో లింగాయత్ మహార్యాలీ నిర్వహిస్తున్నట్లు లింగాయత్ సమన్వయ సమితి సెంట్రల్ కమిటీ అధికార ప్రతినిధి కె.మల్లికార్జునప్ప తెలిపారు. ఆదివారం ఉదయం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో లింగాయత్ మహాసభ నిర్వహిస్తున్నామని అనంతరం మధ్యాహ్నం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి ట్యాంక్ బండ్ వరకు లింగాయత్ మహార్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. తమకు మద్దతుగా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి లింగాయత్‌లు పెద్ద ఎత్తున నగరానికి తరలి వస్తున్నారన్నారు. లింగాయత్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ఓబీసీ జాబితాలో చేర్చాలని గత కొంత కాలంగా తాము ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

నాంపల్లి: మెట్రో పాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాదు ఆధ్వర్యంలో ఈ నెల 10న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని, అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం మెట్రో పాలిటన్ న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సెషన్స్ జడ్జి ప్రేమవతి సూచనల మేరకు మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ న్యాయ సేవాధికార సంస్థ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జూన్ 10న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పూర్తయ్యేలా చూడాలని, లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పోలీసు వారి సహకారంతో పోలీసు స్టేషన్ వారిగా లోక్‌అదాలత్‌లో రాజీ అయ్యే కేసుల వివరాలు తెలుసుకుని, అధిక సంఖ్యలో కేసులు పూర్తయ్యేలా చూడాలని కోరారు

ముస్లింల సంక్షేమానికి కృషి

చార్మినార్: తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు ముస్లిం ప్రజల సంక్షేమం జోరుగా జరుగుతోందని బీఆర్‌ఎస్ పార్టీ చార్మినార్ నియోజక వర్గం ఇంచార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడం వద్ద పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సంబరాలలో భాగంగా ఆయన జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు అతి తక్కువ ముస్లిం రెసిడెన్సియల్ పాఠశాలలు మాత్రమే కొనసాగాయని..ప్రస్తుతం తమ ప్రభుత్వ హయాంలో వందన మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. షాదీ ముబారక్‌తో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు.

క్రైస్తవ ఉద్యమకారులకు ఎమ్మెల్సీ కేటాయించాలి

నాంపల్లి: దశాబ్ది తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గన్ పార్కు వద్ద తెలంగాణ అమరవీరులకు దళిత క్రైస్తవ ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షులు నాగళ్ళ పోచయ్య ఇశ్రాయేల్, క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షులు జెరుషలేము మత్తయ్య హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెరుషలేము మత్తయ్య మాట్లాడుతూ... తెలంగాణ క్రైస్తవ ఉద్యమకారులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని కోరారు. అలాగే క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల పదవులను భర్తీ చేసి తెలంగాణ క్రైస్తవ పోరాట యోధులను గుర్తించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.